క్లుప్తంగా

రుణాలు ఇప్పించండి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

కొల్చారం(నర్సాపూర్): రైతులకు, తిరిగి రుణ సదుపాయం కల్పించాలని మండలంలో కిష్టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని సభ్యులు సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ మల్లేశంగౌడ్ మాట్లాడుతూ.. సంఘం పరిధిలో 174 మంది సభ్యులు ఉండగా.. 106 మందికి ప్రభుత్వం ప్రకటించిన రుణ మాఫీ వచ్చిందన్నారు. ఎస్‌బీఐ(ఏడీబీ)పరిధిలోని రుణమాఫీ వచ్చిన రైతులకు తిరిగి రుణాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరినట్లు తెలిపారు.

వైభవంగా కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ



హోమం చేస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని సికింద్లాపూర్‌లోని లోతన్ చెరువు కట్టపై దాత సాయంతో ఆలయ నిర్మాణం చేపట్టి మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండితుడు అయోధ్య రామ శర్మ ఆధ్వర్యంలో పుణ్యావచనం, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలతో పాటు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం చేశారు. పూజల్లో ఎమ్మెల్యే సునీతా రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మైసమ్మ విగ్రహ దాత ఏనుగు సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు హరికృష్ణ, మన్సూర్, చంద్రగౌడ్, నర్సరెడ్డి, రాజుగౌడ్, కుమార్, నిర్వాహకులు లచ్చగౌడ్, కాళిదాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు మాధవ రెడ్డి, నర్సింహరెడ్డి, శ్రీనివాస్, బీజేపీ నాయకుడు ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

ముత్యాలమ్మకు ఎమ్మెల్యే పూజలు



కామారంలో ముత్యాలమ్మకు పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే రోహిత్

చిన్నశంకరంపేట(మెదక్): ముత్యాలమ్మ ప్రజలందరిని చల్లంగా చూడాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కోరారు. సోమవారం మండలంలోని కామారం గ్రామంలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్‌లు గడీల సుధాకర్, యాదగిరియాదవ్, గ్రామ నాయకులు వెంకట్‌రెడ్డి, సత్యం, గోపాల్, శ్రీశైలం, ఎల్లం, రాములు తదితరులు పాల్గొన్నారు.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్నయ్యపల్లి ప్రధాన రోడ్‌లో గత వారం రోజులుగా పగలు వీధి దీపాలు వెలుగుతున్నాయి. రాత్రి సమయంలో వెలగాల్సిన వీధిపాలు 24 గంటలు వెలుగుతూనే ఉన్నాయి. నిర్వహణ బాధ్యతలు చేపట్టాల్సిన పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సిబ్బంది ఉదయం పంచాయతీ సిబ్బంది వీధి దీపాల స్విచ్‌లు ఆఫ్ చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



నత్నయ్యపల్లిలో పగలు వెలుగుతున్న వీధిదీపాలు

డీఈకి సన్మానం



విద్యుత్‌శాఖ డీఈని సన్మానిస్తున్న టీజీయూఈఈ కమిటీ

మెదక్ కలెక్టరేట్: సీఐటీయూ అనుబంధ యూనియన్ టీజీయూఈఈ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్‌శాఖ డీఈ షేక్ చాంద్‌భాషను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీంద్ర ప్రసాద్, మెదక్ జిల్లా అధ్యక్షులు మన్నె నర్సింలు, స్వామి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్ర బానప్ప, జాయింట్ సెక్రటరీ సురేష్, శ్రీనివాస్, దశరథ, నరేష్, రాజు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం కావాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్ మున్సిపాలిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, చైర్మన్, తహసీల్దార్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

నర్సాపూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలో తాగునీటి వసతులు కల్పించేందుకు రూ.12కోట్లు మంజూరయ్యాయని, వాటితో పట్టణంలో అవసరమైన చోట ట్యాంకులు, పైపులైన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా తాను సమావేశానికి వస్తున్నట్లు చెప్పినా.. తాను రాక ముందే సమావేశం ఎలా ప్రారంభించారని ఆమె మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను వచ్చే వరకు ఆగకపోతే తనకు ఎజెండా ఎందుకు పంపారని ఎమ్మెల్యే కమిషనర్‌ను ప్రశ్నించారు. మున్సిపల్ పరిధిలో జరిగే అన్ని అధికారిక కార్యక్రమాల సమాచారం సైతం తనకు ఇవ్వడం లేదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు మురళీయాదవ్, బుచ్చేష్‌యాదవ్, రాజేందర్, సురేష్, యాదగిరి మాట్లాడుతూ.. వార్డు ఆఫీసర్లు, పారిశుద్ధ్య సిబ్బంది తమ వార్డుల్లో చెత్త సరిగా సేకరించడం లేదని దీంతో చెత్త చాలా చోట్ల పేరుకుపోతుందని ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. సిబ్బంది రానందున పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదని ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. విధులకు రాని సిబ్బంది వివరాలు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి వారి సూచనల మేరకు విధులకు గైర్హాజరవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు సూచించారు. తన వార్డు నుంచి ఎక్కువ పన్నుల రూపంగా మున్సిపాలిటీకి ఎక్కువ ఆదాయం వస్తున్నదని, పలుచోట్ల చదును చేసే పనుల కోసం జేసీబీ కావాలని మూడు నెలలుగా అడుగుతున్నా.. జేసీబీ పంపడం లేదని కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్ సమావేశంలో ఆరోపించారు. జేసీ బీ పదవ వార్డుకు వీలైనంత త్వరగా పంపించాలని చైర్మన్, కమిషనర్‌కు సూచించారు. సమావేశంలో నిర్ణయించిన పనులను సకాలంలో చేపట్టడం లేదని, కౌన్సిలర్ మురళీయాదవ్ ప్రశ్నించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గోమారం గ్రామంలో రామేశ్వరం చండి రైతు ఉత్పత్తిదారుల సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సన్నరకం, దొడ్డురకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు 500 బోనస్ ఇవ్వాలన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించొదని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు రమణగౌడ్, హరికృష్ణ, మన్సూర్, మాధవరెడ్డి, చంద్రగౌడ్, నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, భిక్షపతిచారి, శ్రీశైలంయాదవ్, మహిపాల్‌రెడ్డి, కుంట లక్ష్మణ్, భిక్షపతిరెడ్డి, శ్రీనివాస్, సుధీర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, రామేశ్వరం చండి రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్ మద్దూర్‌లో..

నర్సాపూర్ రూరల్: మండలంలోని కాగజ్ మద్దూర్, అహ్మద్ నగర్‌తో పాటు ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, శేఖర్, అశోక్ గౌడ్, శివకుమార్ తదితరులున్నారు.

కమ్యూనిటీ హాల్‌లోకి అంగన్‌వాడీ కేంద్రం

సాక్షి ఎఫెక్ట్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని లింగోజిగూడలో అంగన్‌వాడీ శిథిలావస్థ భవనంలో బోధన విషయమై సాక్షి దినపత్రికలో సోమవారం ప్రమాదం జరిగితే బాధ్యులెవరు? అనే కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత అధికారులు స్పందించారు. శిథిలావస్థ భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని కమ్యూనిటీ హాల్‌లోకి మార్చారు. త్వరలో నూతన అంగన్‌వాడీ భవనం నిర్మాణం అనంతరం సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని, అప్పటి వరకు కమ్యూనిటీ హాల్ కొనసాగుతుందని ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా తెలిపారు. జిల్లా అధికారుల సూచనల మేరకు ఐసీడీఎస్ మండల సూపర్ వైజర్ సంతోష సోమవారం కేంద్రాన్ని సందర్శించి కమ్యూనిటీ హాల్‌లోకి తాత్కాలికంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కవిత, తదితరులు ఉన్నారు.



కమ్యూనిటీ హాల్‌కి మార్చిన అంగన్‌వాడీ కేంద్రం

ఇసుక అక్రమ రవాణా

పట్టించుకోని అటవీశాఖ అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నా.. అటవీశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. మండలంలోని ఖాజాపూర్‌తండా శివారులో నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అక్రమార్కులు ఇసుకను తరలిస్తున్నట్లు గిరిజనులు తెలిపారు. అటవీ ప్రాంతం గుండా ఉన్న వాగు వంకలు, పొలాల నుంచి ఇసుకను తరలిస్తున్నా.. అటవీశాఖ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయంపై ఖాజాపూర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కృష్ణాగౌడ్‌ను ప్రశ్నించగా.. తామేవరి వద్ద డబ్బులు తీసుకోలేదన్నారు. తమ చేతికి చిక్కిన ట్రాక్టర్లకు జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు.



ఖాజాపూర్‌తండా అటవీప్రాంతం నుంచి ఇసుకను తరలించిన దృశ్యం

అక్షరాస్యతతోనే మూఢనమ్మకాలకు చెక్

కొల్చారం(నర్సాపూర్): అక్షరాస్యతతోనే మూఢనమ్మకాల నిర్మూలన సాధ్యమని ఎస్‌ఐ మహమ్మద్ గౌస్, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం కొల్చారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల గురుకుల పాఠశాల,కస్తూర్బా బాలికల విద్యాలయంలో మహిళల రక్షణ- సైన్స్- మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నరేశ్ మాంత్రికులు, భూత వైద్యులు చేసే జిమ్మిక్కులను సైన్స్‌షో ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండి, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ తారాసింగ్, సంబంధిత పాఠశాల, కళాశాల ప్రిన్సిపాళ్లు, పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందంతో పాటు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నరేశ్

అన్నిరకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

కౌడిపల్లి(నర్సాపూర్): అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని తునికి, హరిచంద్‌తండా, ముట్రాజ్‌పల్లి, వెంకటాపూర్(ఆర్), రాయిలాపూర్, మహమ్మద్‌నగర్, కౌడిపల్లి, ధర్మాసాగర్ తదితర గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆశ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం సంగమేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ జహీర్, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, మాజీ ఎంపీపీ రాజు, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, ప్రవీణ్ కుమార్, మాజీ సర్పంచ్‌లు, మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నార్సింగిలో ..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో మంజీర రైతు ఉత్పత్తుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ షేక్ కరీం, ఎంపీడీఓ ఆనంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో మంజీర రైతు ఉత్పత్తుల సహకార సంఘం అధ్యక్షులు నర్సింహారెడ్డి, డైరెక్టర్ నర్సింలు, నర్సింహారెడ్డి, శ్రీనివారెడ్డి, ఎల్లం, శ్రీనివాస్, ఏఈఓ విజృంభణ, సీఈఓ సూర్య పాల్గొన్నారు.



నార్సింగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ షేక్ కరీం

పేకాట స్థావరంపై దాడులు

- పోలీసుల అదుపులో 12 మంది
- రూ.25 వేలు స్వాధీనం
- 30 మంది పరారీ

తూప్రాన్: మండలంలోని దతార్‌పల్లిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడు చేశారు. ఇందులో 12 మంది పట్టుబడగా, పలువురు పరారయ్యారని సీఐ రంగాకృష్ణ సోమవారం తెలిపారు. గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో సుమారు 40 మంది వ్యక్తులు రూ.లక్షల్లో డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే తమ సిబ్బందితో పేకాట ఆడుతున్న వారిపై దాడులు చేయగా సుమారు 12 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. మరో 30 మంది వ్యక్తుల వరకు పారిపోయారు. పట్టుబడిన వారి నుంచి 6 బైక్‌లు, 6 సెల్‌ఫోన్లు రూ.24,900 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఆ మేరకు పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేశామని వివరించారు.

ప్రమాదాలపై రైతులకు అవగాహన

శివ్వంపేట(నర్సాపూర్): ప్రధాన రోడ్లపై రైతులు ధాన్యం కల్లాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రోడ్లపై జరుగుతున్న ప్రమాదాల గురించి పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం వస్తుండడంతో రైతులు రోడ్లపై ఆరబోస్తుండడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. ముఖ్యంగా చిన్నగొట్టిముక్ల – జీడిపల్లి, వెల్దుర్తి – నర్సాపూర్ ఆర్‌అండ్‌బీ రోడ్లపై కల్లాలు ఏర్పాటు చేస్తుండడం వల్ల గతంలో బైక్‌లు అదుపు తప్పి ప్రమాదాలు జరిగి పలువురు మృతిచెందిన సంఘటనలున్నాయి. పలు వాహనాలు సైతం ప్రమాదాలకు గురైన సంఘటనలు జరిగాయి. రోడ్లపై కల్లాలు ఏర్పాటు చేయకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి.



గోమారం ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన కల్లాలు

పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలి

మెదక్ కలెక్టరేట్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరెట్ ఎదుట కార్మికులతో కలిసి నిరసన తెలిపి, కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, మధ్యాహ్న భోజన కార్మికులకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేతనాలు రూ.10వేలకు పెంచుతామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు ఆ ఊసే ప్రభుత్వం ఎత్తడం లేదన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, బాలమణి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

'వాస్తవ విశ్లేషణ'పై వర్క్‌షాప్

మెదక్ కలెక్టరేట్: వాస్తవ విశ్లేషణ అనే అంశంపై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర విభాగం, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా ఉస్మానియా విశ్వవిద్యాలయ రిటైర్డ్ ప్రొఫెసర్ గోవర్ధన్, అసోసియేట్ ప్రొఫెసర్ వేణు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొ.గోవర్ధన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు గణితంలో అనుసరించాల్సిన మెళకువలను వివరించారు. ప్రొ.వేణు మాట్లాడుతూ విద్యార్థులు కాలానుగుణంగా వస్తున్న మార్పులను గమనిస్తూ, మార్పులకు అనుగుణంగా కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఆసక్తిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, గణితశాస్త్ర అధ్యాపకులు వెంకటేశ్వర్లు, పశుపతి శర్మ, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల అధ్యాపకురాలు హరిప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం టాలీ వర్క్‌షాప్ బ్రొచర్ ఆవిష్కరించారు. కామర్స్ శాఖాధిపతి డాక్టర్ శరత్‌రెడ్డి మాట్లాడుతూ నేటి వ్యాపార రంగంలో ఈ సాఫ్ట్‌వేర్‌కు ప్రాధాన్యత ఉందని, అందుకే ఈ సర్టిఫికెట్ కోర్స్ ప్రవేశ పెడుతున్నామని శాఖాధిపతి తెలిపారు.



టాలీ వర్క్‌షాప్ బ్రొచర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా టీపీయూఎస్(తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్) ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్లకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏలు, పీఆర్సీ, తదితర పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 5 డీఏల్లో కనీసం ఒక్క డీఏ కూడా ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు.



నర్సాపూర్ రూరల్: బ్రాహ్మణపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న వెంకట్ రామ్



చిలప్‌చెడ్(నర్సాపూర్): డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు



కౌడిపల్లిలో..



పెద్దశంకరంపేటలో..



టేక్మాల్‌లో..



పాపన్నపేటలో..



చిన్నశంకరంపేటలో ..

సంక్షిప్త వార్తలు

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో అత్యవసర సమయాల్లో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. వెల్దుర్తికి చెందిన అశీష్‌గౌడ్, ప్రవీణ్‌లకు ఆయన చెక్కులు అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు మహేశ్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, నర్సింహారెడ్డి, శ్రీశైలం, హరీశ్ తదితరులు ఉన్నారు.

◆ **మహాసభలు విజయవంతం చేయాలి**

నర్సాపూర్: సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి నాగరాజు సోమవారం అన్నారు. సీపీఎం జిల్లా 15వ మహాసభలను నవంబరు 2, 3 తేదీల్లో తూప్రాన్‌లో నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. సమావేశాలను విజయవంతం చేయాలని ఆయన పార్టీ కార్యకర్తలను కోరారు.

◆ **సర్టిఫికెట్ కోర్స్ బ్రోచర్ ఆవిష్కరణ**

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పబ్లిక్ రిలేషన్ సర్టిఫికెట్ కోర్స్ మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. ప్రస్తుతం బీఏ, బీకామ్, బీఎస్సీ చదువుతున్న విద్యార్థులు ఇందులో చేరవచ్చునన్నారు. ఈ కోర్స్ సమన్వయకర్తగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ ప్రొ. సురేందర్‌రావు వ్యవహరిస్తారన్నారు.

◆ **పాఠశాల తనిఖీ**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహమ్మద్‌నగర్ గేట్‌తండాను ఎంఈఓ బాలరాజు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థం అయ్యేలా విద్యబోధన చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గుణితాలు రావాలని చెప్పారు.

◆ **వ్యాన్‌ను ఢీకొని ముగ్గురికి గాయాలు**

చేగుంట(తూప్రాన్): డీసీఎం వ్యాన్‌ను ఢీకొన్న ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రం చేగుంటలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న డీసీఎం చేగుంట ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో మలుపు తీసుకుంటున్న కారును, అదే వేగంతో రోడ్డు పక్కన మాట్లాడుతున్న ముగ్గురు వ్యక్తులు బైకును ఢీకొని చెట్టుకు తగిలి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో రోడ్డు పక్కన మాట్లాడుతున్న రబ్బానీ, శోభన్, గణేశ్‌లకు గాయాలయ్యాయి. రబ్బానీ తలకు తీవ్రగాయం కాగా మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి వినతి

హవేళిఘనపూర్: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలతో పాటు వెంటనే పీఆర్సీ ప్రకటన ఇవ్వాలని తపస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం మండల అధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం రెవెన్యూ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌ను కోరారు.

